క్లుప్తంగా

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న డివిజనల్ మేనేజర్ స్వామి, బ్రాంచ్ మేనేజర్ అశోక్ తదితరులు

కరీంనగర్: గాయత్రి బ్యాంకు ఖాతాదారుడైన ఎంద్ర రాములు ప్రమాదవశాత్తు మరణించగా.. ఆయన భార్య శారదకు రూ.లక్ష చెక్కును సీనియర్ డివిజనల్ మేనేజర్(ఎస్‌డీసీ) పుల్లూరి స్వామి, బ్రాంచి మేనేజర్ జి.అశోక్, జూనియర్ ఆఫీసర్ వి.విష్ణుప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ది గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాద బీమా సౌకర్యం ద్వారా రూ.లక్ష చెక్కును అందజేశారు. సీనియర్ డివిజినల్ మేనేజర్(ఎస్‌డీసీ) పుల్లూరి స్వామి మాట్లాడుతూ.. ఖాతాదారులకు కనీస డిపాజిట్‌తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్యతరగతి వినియోగదారులకు ప్రమాద బీమా కల్పిస్తూ వారికి అండగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి'

కరీంనగర్: లోక్‌సభ ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని, ఎస్సీ వర్గీకరణ చేస్తామంటూ హామీలిచ్చి చేతులెత్తేసిన బీజేపీకి మాదిగలు గుణపాఠం చెపాల్సిన అవసరముందని దళిత సంఘాల రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ చైర్మన్, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. దళిత సంఘాల అత్యవసరం సమావేశం కిసాన్‌నగర్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలను కాంగ్రెస్ పార్టీ విస్మరించడం అవమానపర్చడమేనని అన్నారు. మాదిగ జాతి ఆత్మగౌరవానికి.. కాంగ్రెస్, బీజేపీలకు జరుగుతున్న ఈ యుద్ధంలో అంతిమంగా మాదిగలే విజయం సాధించాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. దళిత సంఘాల నాయకులు ధరపల్లి క్రాంతి, కల్లేపల్లి నవీన్, ఆసంపల్లి వినయ్, ధరపల్లి అంజి, చిలుముల మహేందర్, నీరుకుల్లా రమేశ్, మోదుంపల్లి ఆంజనేయులు, రాగటి రాజు, పవన్, శ్రావణ్, ఖలీం, తిరుపతి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల తదితరులు

కరీంనగర్: భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకుడు మైఖేల్ శ్రీనివాస్ తండ్రి కొత్తకొండ రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, నాయకులు కలర్ సత్యనారాయణ, గూడెల్లి రాజ్‌కుమార్, పూసల శ్రీకాంత్, రవికాంత్ తదితరులున్నారు.

రేపు శ్రీపద మంజీరాలు పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత, ఎన్టీపీసీ విశ్రాంత డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్) నగునూరి రాజన్న రచించిన శ్రీపద మంజీరాలు శ్రీపదాల సంపుటి ఆవిష్కరణను ఆదివారం ఉదయం 9.30 గంటలకు వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు గుండు రమణయ్య, వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సినీ గేయ రచయిత, నంది పురస్కార గ్రహీత వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరౌతారని, అతిథిగా శ్రీపదాల రూపకర్త అనూశ్రీ గౌరోజు వస్తున్నారని పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

హుజూరాబాద్/జమ్మికుంట: హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసి అక్రమ లేవుట్లు, రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వారికి సహకరిస్తున్న అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో, జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారం, రామన్నపల్లి, అబాది జమ్మికుంట, హుజూరాబాద్ రోడ్డు, కోరపల్లిరోడ్డులో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు కబ్జాలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. వారికి పోలీసులు, అధికారులు సహకరిస్తున్నారని వాపోయారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కరీంనగర్ న్యాయవాదులు



హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు

కరీంనగర్‌క్రైం: హైకోర్టు జడ్జి, కరీంనగర్ జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్‌ను శుక్రవారం కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఇటీవల మంజూరైన జిల్లా కోర్టు నూతన భవన సముదాయ నిర్మాణ శంకుస్థాపన గురించి చర్చించారు. ఈ విషయంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించి త్వరలోనే శంకుస్థాపన తేదీని ఖరారు చేసి చెబుతానని జస్టిస్ లక్ష్మణ్ తెలిపినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెల్లడించాడు. కరీంనగర్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బేతి మహేందర్‌రెడ్డి, కార్యదర్శి బీమాసాహెబ్, కోశాధికారి రామగిరి శ్రీనివాస్, లైబ్రరీ సెక్రటరీ కటకం రాజేందర్, కార్యవర్గ సభ్యులు మాతంగి రవీందర్, సుంకే దేవకిషన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

కరీంనగర్ కార్పొరేషన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని మెప్మా అధికారులు కోరారు. శుక్రవారం నగరంలోని తీగలగుట్టపల్లిలోని స్వరాజ్ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్, మంకమ్మతోటలోని కమలశ్రీ అపార్ట్‌మెంట్లలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఐ వోట్ ఫర్ ష్యూర్ అనే కార్యక్రమాన్ని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. పటిష్టమైన దేశం కావాలంటే ప్రతి ఒక్కరూ ఓటేయాలని మెప్మా అధికారులు అన్నారు. ఓటు హక్కు వినియోగించుకుంటామంటూ అపార్ట్‌మెంట్ వాసులు ప్రతిజ్ఞ చేశారు. మెప్మా డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ అనిత, సీవోలు స్వప్న, దీప, ఆర్‌పీలు స్వరూప, సరళ, లలిత పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

కరీంనగర్: జిల్లావ్యాప్తంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా జరిగాయని సీహెచ్ జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉదయం టెన్త్ మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 388 మంది విద్యార్థులకు 350 మంది(90 శాతం) హాజరయ్యారని, ఇంటర్ ఐదు కేంద్రాల్లో మొత్తం 747 మంది విద్యార్థులకు 670 మంది(90 శాతం) హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం టెన్త్ మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 50 మంది విద్యార్థులకు 47 మంది(94 శాతం) హాజరయ్యారని అన్నారు. ఎనిమిది మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో అన్ని పరీక్ష కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారని తెలిపారు. జిల్లాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్ మొత్తంగా 92 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

పాలిథిన్ వ్యర్థాలపై నియంత్రణ కరువు



రాజీవ్ రహదారిలో ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు



దుర్శేడ్‌లో డ్రైనేజీ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

- గ్రామాల్లో విచ్చలవిడిగా వినియోగం

కరీంనగర్‌రూరల్: పాలిథిన్ వినియోగం మనిషి జీవన విధానంలో ప్రధాన భాగమైపోయింది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన పాలిథిన్ వినియోగం క్రమేపీ గ్రామాలకూ విస్తరించింది. మార్కెట్‌లో ఏది కొన్నా పాలిథిన్ కవర్లలోనే ఇస్తున్నారు. హోటళ్లు, కిరాణాలు, బేకరీలు, చికెన్, మటన్ సెంటర్లు, ఇతర వ్యాపార సంస్థల్లో కవర్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. దీంతో కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోంది. పాలిథిన్ వినియోగం మనుషులకే కాదు.. పశుపక్ష్యాదులకు సైతం ప్రమాదకరంగా మారింది. గతంలో ప్రమాదకరమైన పాలిథిన్ నియంత్రణపై అధికారులు కఠిన చర్యలు చేపట్టినా.. తర్వాత పట్టించుకోకపోవడంతో అనూహ్య రీతిలో వినియోగం పెరిగింది.

నిబంధనలు బేఖాతరు

కరీంనగర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో పాలిథిన్ వినియోగంపై నియంత్రణ కరువైంది. పలు గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, మురుగు కాలువలు, రోడ్ల పక్కన పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలు, గ్లాసులు, ప్లేట్లు ఇతర వ్యర్థ పదార్థాలు ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. దుకాణాల్లో ఏ వస్తువు కొనుగోలు చేసినా.. అమ్మకందారులు పాలిథిన్ కవర్లలో ఇవ్వడం అలవాటుగా మారింది. పాలిథిన్ కవర్లు దాదాపు 80 శాతం భూమిలో కరగకుండా అలాగే ఉండిపోతాయి. పాలిథిన్ కవర్లతో పొంచి ఉన్న ముప్పును గుర్తించిన ప్రభుత్వం రెండేళ్ల క్రితం వాడకంపై నిబంధనలు విధించింది. వినియోగదారులపై జరిమానా విధించారు. ప్రధానంగా కిరాణాలు, హోటళ్లు, చికెన్, మటన్ సెంటర్లలో వినియోగించకుండా చర్యలు చేపట్టడంతో.. కొన్నాళ్లు కవర్ల వినియోగం తగ్గింది. అయితే క్రమేపీ అధికారుల పర్యవేక్షణ లోపంతోపాటు క్షేత్రస్థాయిలో నిబంధనలను కఠినంగా అమలు చేయలేదు. నామమాత్రంగా చర్యలు చేపట్టడంతో అమ్మకందారులు, వినియోగదారులు యథావిధిగా పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు.

అవగాహన కల్పిస్తే మేలు

ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామీణ ప్రజలు ఎక్కడ పడితే అక్కడ ఇష్టారీతిన పడేస్తున్నారు. పాలిథిన్ నిర్మూలన, వ్యర్థాలను పడేయడంపై సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పాలిథిన్‌ను కాల్చివేయడంతో వచ్చే విష వాయువుతో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశముందని వైద్యులు పేర్కొంటున్నారు. పాలిథిన్ కవర్లకు బదులుగా బట్ట, జనపనారతో చేసిన చేతి సంచులు, ఆకులతో తయారు చేసిన విస్తర్లు లేదా స్టీల్ ప్లేట్లు, గ్లాసులను ఉపయోగిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. నాణ్యత లేని పాలిథిన్ కవర్లు, గ్లాసుల వినియోగంతో కలిగే అనర్థాలపై కళాజాత బృందాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ భేటీ



సమావేశమైన సమన్వయ కమిటీ సభ్యులు

కరీంనగర్ కార్పొరేషన్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటైన నగర కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ శుక్రవారం సమావేశమైంది. నగరంలోని కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు నివాసంలో భేటీ అయిన సమన్వయ కమిటీ సభ్యులు.. ప్రచార నిర్వహణ, నగరంలోని 60 డివిజన్లలో పోలింగ్ బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ కన్వీనర్ వైద్యుల అంజన్‌కుమార్, సభ్యులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణగౌడ్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, నడిపెల్లి అశోక్‌రావు, సయ్యద్ వహాజొద్దీన్, మహమ్మద్ ఆరిఫ్ పాల్గొన్నారు.

రేపు చామనపల్లిలో కాంగ్రెస్ కార్నర్ సమావేశం



మాట్లాడుతున్న రాంరెడ్డి

కరీంనగర్‌రూరల్: చామనపల్లి గ్రామంలో ఎంపీ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఈనెల 28న కాంగ్రెస్ పార్టీ కార్నర్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి తెలిపారు. శుక్రవారం దుర్శేడ్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చామనపల్లి నుంచి పార్టీ ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సమావేశానికి హాజరవుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బ్లాక్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, నాయకులు బాషవేణి మల్లేశంయాదవ్, జక్కని కనకయ్య, బాపురెడ్డి, సాయిని శ్రీనివాస్, బెజ్జంకి శేఖర్, మీసాల సాయిలు, బుర్ర హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యపై ప్రకటన చేయాలి



డీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న ఆటో డ్రైవర్లు

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ జేఏసీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డీఆర్వోకు వినతి పత్రాన్ని కార్మిక సంక్షేమ సంఘం తరఫున అందజేశారు. మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు ఇప్పటివరకు 50 మంది ఆత్మహత్య చేసుకున్నారని, వెంటనే ఆత్మహత్యలు చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల సమస్యపై ప్రకటన చేయాలని కోరారు. ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్, కార్యదర్శులు నాగుల మహేందర్, వడ్లకొండ శ్రీనివాస్, ఈరవెల్లి కుమార్, సభ్యులు ఎండీ నసీరుద్దీన్, వాల్క రమేశ్, నసీరుద్దీన్, కృష్ణ పాల్గొన్నారు.

30న డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా

సప్తగిరికాలనీ(కరీంనగర్): వీణవంక జిల్లాపరిషత్ పాఠశాలలో పీడీగా పని చేస్తున్న పోతన శ్రీనివాస్‌ను తిరిగి పూర్వ పాఠశాలలో పునర్నియామకం చేయకుంటే ఈనెల 30న డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్లు శుక్రవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్నిచ్చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సెస్సీ పరీక్షలు, ఎస్సెస్సీ మూల్యాంకనం సందర్భంగా పలు కారణాలతో ముగ్గురు ఉపాధ్యాయులను డీఈవో సస్పెండ్ చేయగా.. అందులో ఇద్దరు ఉపాధ్యాయులను తిరిగి వారు చేస్తున్న పాఠశాలకే నియామకం చేశారన్నారు. కాని పోతన శ్రీనివాస్ పీడీగా నగునూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో పని చేస్తుండగా.. అదే పాఠశాలకు కాకుండా వీణవంక జిల్లాపరిషత్ పాఠశాలకు బదిలీ చేశారని తెలిపారు. అగ్ర వర్ణాలైన ఇద్దరికి అదే పాఠశాలలో నియామకం, దళిత వర్గానికి చెందిన శ్రీనివాస్‌కు వేరేచోటుకు బదిలీ అన్యాయమని వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు మల్లిక్, కిషన్‌నాయక్, రాజన్న ఉన్నారు.

వాహనాల తనిఖీ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రధాన చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం ఎస్సై మామిడాల సురేందర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. లేదంటే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిత్ర కథ



నిరుపయోగం..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ప్యాడీక్లీనర్లు నిరుపయోగంగా మారాయి. రైతులు ధాన్యం శుభ్రం చేసుకునేందుకు వీలుగా కరీంనగర్ మండలం 17 గ్రామాల్లోని కేంద్రాల్లో ఒకటి నుంచి రెండు ప్యాడీక్లీనర్లను అందుబాటులో ఉంచారు. అయితే వేసవి ఎండ తీవ్రతకు భయపడిన రైతులు ప్యాడీక్లీనర్లలో ధాన్యం శుభ్రపరుచుకునేందుకు ముందుకు రావడంలేదు. శుభ్రం చేయని ధాన్యాన్ని 42 కిలోల కాంటా పెట్టాలనే రైసుమిల్లర్ల డిమాండ్‌కు రైతులు అంగీకరించడంతో ప్యాడీక్లీనర్లతో పని లేకుండా పోయింది.

– కరీంనగర్‌రూరల్

సమూహ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

కరీంనగర్ కల్చరల్: లౌకిక విలువ లౌకిక విలువలు సాహిత్యం అనే అంశంపై ఈనెల 28న వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సదస్సుకు ఆలోచనపరులైన బుద్ధిజీవులు హాజరు కావాలని తెలంగాణ రచయితల వేదిక పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సమూహ రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను కవులు, రచయితలు ఆవిష్కరించారు. సమూహ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు గాజోజు నాగభూషణం మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత సహజీవనాన్ని ఎత్తిపట్టేందుకు సుస్థిరమైన ప్రశాంతతను నెలకొల్పేందుకు కవులు తమ కలాలను, గళాలను వినిపించాలన్నారు. రచయిత కందుకూరి అంజయ్య మాట్లాడుతూ.. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించి సమాజంలో సౌభాగ్యాన్ని వర్ధింపజేయాలని సమూహ సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. కవులు సి.వి.కుమార్, దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, విలాసాగర్ రవీందర్, నెరువట్ల చైతన్య, ఎండీ ఖాలిద్, కనకం శ్రీనివాస్, పెనుగొండ బసవేశ్వర్, సదాశ్రీ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు



విద్యార్థులకు సమయ పాలనపై అవగాహన కల్పిస్తున్న ఇంపాక్ట్ ప్రతినిధులు

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దని ఇంపాక్ట్ ఎగ్జిక్యూటివ్ అప్పన్నగారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో సమయ పాలనపై అవగాహన తరగతులు నిర్వహించారు. విద్యార్థులు విద్య పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఆలోచన విధానాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇంపాక్ట్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

మానకొండూర్‌రూరల్: భూ సమస్య పరిష్కరించాలని, భార్య కాపురానికి రావట్లేదని మండలంలోని వెల్ది గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి సెల్ టవర్ హల్‌చల్ చేశాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాలు..గ్రామానికి చెందిన వడ్లూరి శ్రావణ్(32)కు గ్రామ శివారులో ఐదుగుంటల వ్యవసాయ భూమి ఉంది. పక్కన రామగిరి(ట్రాక్టర్) బాబు, నాంపల్లి, కుమార్, రాజయ్య, శంకర్(డీలర్)ల వ్యవసాయ భూములున్నాయి. ఆరేళ్లుగా తన భూమిలోకి వెళ్లడానికి ఐదుగురు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, భూమి విక్రయించాలనుకుంటే అడ్డుకుంటున్నార ని, మూడు నెలల క్రితం భార్య గొడవల కారణంగా పుట్టింటికి వెళ్లి కాపురానికి రాక పోవడంతో మానసిక వేదనకు గురవుతున్నాడని తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని సెల్‌టవర్ ఎక్కి భూసమస్య పరిష్కరించాలని, భార్యను కాపురానికి వచ్చేలా చేయాలని మధ్యాహ్నం రెండు గంటల వరకు పైనే ఉన్నాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎంత చెప్పిన కిందికి రాలేదు. సమస్య పరిష్కరించాలని రావాలని డిమాండ్ చేయగా సీఐ రాజ్‌కుమార్ ఫోన్‌లో హామీ ఇవ్వడంతో సెల్‌టవర్ దిగాడు. పోలీసులు శ్రావణ్‌ను ఇంటికి పంపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

దొంగిలించిన బైక్‌లు స్వాధీనం



తిమ్మాపూర్: కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా బైకులు చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో కరీంనగర్ 1 టౌన్ పోలీసులు నిఘాపెట్టి పక్కా సమాచారంతో శుక్రవారం 20 బైకులను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన బోయిని చంద్రబాబు, గోనెల శంకర్ జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం కరీంనగర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి నిందితుల ఇళ్లకు వెళ్లి విచారించారు. బైక్‌లు దొంగలించినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి బైకులను స్వాధీనం చేసుకుని తిమ్మాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కరీంనగర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీసులు మరింత పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అక్రమంగా డబ్బు, మద్యం, గంజాయి, ఇతర పంపిణీ వస్తువుల రవాణా అడ్డుకునేందుకు కరీంనగర్‌లోని బస్టాండ్, రైల్వే స్టేషన్, వాహన తనిఖీలు, ఇతర రద్దీ ప్రదేశాల్లో పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికలు ముగిసేవరకు ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని సీపీ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడి పట్టుబడ్డ వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపడతామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు చేపట్టామని అన్నారు.